కేసీఆర్‌తోనే మున్సిపాలిటీల అభివృద్ధి

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ: సీఎం కేసీఆర్‌తోనే మున్సిపాలిటీల మెరుగైన అభివృద్ధి జరుగుతుందని, ఇటీవల మరిపెడ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ కేటాయించిన రూ.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. మరిపెడ మున్సిపాలిటీలోని 1, 2, 5, 8, 9, 10, 11, 15 వార్డుల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయా వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశాడు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూర అధ్యక్షతన జరిగిన ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. సీఎం కేటాయించిన రూ.25కోట్లలో రూ.10కోట్లు 15 వార్డుల్లోని సీసీ రోడ్ల నిర్మాణానికి, ఒక్కో వార్డుకు రూ.65 లక్షల చొప్పున కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరిపెడ మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

మహబూబాబాద్: బయ్యారం చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు గోదావరి జలాలు విడుదల చేయాలని అఖిల పక్షం నాయకులు గౌని ఐలయ్య, జగ్గన్న, వెంకటేశ్వర్లు, బాబురావు డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ గేట్ ఎదుట ధర్నా చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 1997లో బయ్యారం చెరువు మీడియం ఇరిగేషన్‌లో 2004లో ఆనాటి కలెక్టర్ మీడియం ఇరిగేషన్‌లో లేదని ప్రకటించారన్నారు. దాంతో మైనర్ ఇరిగేషన్ జాబితాలో చేర్చడంతో మిషన్ కాకతీయ నిధులు రాకపోవడంతోపాటు ప్రభుత్వ నిధులకు కూడా నోచుకోకపోవడంతో నిరాధరణకు గురి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక్కసారి నింపితే రెండు పంటలకు సరిపోయేదని ఇప్పుడు ఒక్కపంట కూడా సరిపోని స్థితిలో ఉందన్నారు. బయ్యారం చెరువుకు సీతారామ ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముసలయ్య, రాజారావు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ర్యాలీ

బయ్యారం: బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకురావాలనే ప్రధాన డిమాండ్‌తో అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శనివారం మోటార్ సైకిల్ ర్యాలీతో కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, జగ్గన్న, రాజన్న, వెంకటేశ్వర్లు, ముసలయ్య, శ్రీను, బాబురావు, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న సామ పాపయ్య

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యలపై యువతరం ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య పిలుపునిచ్చారు. ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) మహబూబాబాద్ పట్టణ రెండో మహాసభ అల్లి ఏకాంబ్రం అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సామ పాపయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమయ్యాడన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీవైఎల్ పట్టణ అధ్యక్షుడిగా జంపాల జగన్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జంపాల ఉపేందర్‌తో పాటు ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

మహబూబాబాద్: నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టాలని నాణ్యమైన విత్తనాలు ఎరువులను సరఫరా చేయాలని ఎస్సీ ఎస్టీ, బీసీ రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాబన్న డిమాండ్ చేశారు. భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలు, ఐలయ్య, కల్పన, దర్గయ్య, బిక్షపతి, యాకయ్య పాల్గొన్నారు.

ఇండోర్‌లో మున్సిపాలిటీ పాలకవర్గం

మహబూబాబాద్: కెపాసిటి బిల్డింగ్ ట్రైనింగ్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా మానుకోట మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కార్పొరేషన్‌కు వెళ్లిన విషయం విధితమే. దానిలో భాగంగా శనివారం చెత్త తరలింపు కేంద్రం, పొడి చెత్త నిర్వహన కేంద్రంను, తదితర వాటిని సందర్శించారు. పర్యటనలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఈ సీహెచ్ ఉపేందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సర్వే

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం, ఇస్లావత్ తండా జీపీల పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించారు. సదరు గ్రామాల ప్రజలు తమ సమస్యలను సర్వే బృందం ముందు వెల్లడించారు. గ్రామాల ప్రజలు సమస్యలపై ప్రజాసంఘాల బృందానికి గోడును వెళ్లబోసుకున్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్లావత్ సుక్క, విజయ, ఇస్లావత్ పద్మ పాల్గొన్నారు.

జీపుజాతాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కుంట ఉపేందర్

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన అంగన్‌వాడీల జీపుజాతను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల జీపుజాతా ఈనెల 16వ తేదీన ఆదిలాబాద్‌లో ప్రారంభమైందని, 27వ తేదీన మహబూబాబాద్ జిల్లాకు చేరుకుంటుందన్నారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా గుగులోత్ సరోజ, జిల్లా అధ్యక్షులుగా బెస్త సంపూర్ణ, ఉపాధ్యక్షులుగా తిరుపతమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్నేహబిందు, సహాయ కార్యదర్శిగా స్వరూప, కోశాధికారిగా నీలాదేవితోపాటు 25మందితో కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ తెలిపారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



గార్ల: కరపత్రాలను అందజేస్తున్న విమల్‌కుమార్ జైన్

గార్ల: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్ జైన్ జోస్యం చెప్పారు. శనివారం మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించి కరపత్రాలను అందజేస్తూ మాట్లాడారు. దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అన్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఆగడాలను తట్టుకోలేక ప్రజలు విసిగిపోయి బీజేపీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్, జిల్లా నాయకులు జంపాల శ్రీను, బుచ్చిబాబు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో తెలంగాణ అభివృద్ధి

గూడూరు: సీఎం కేసీఆర్ 9ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి చేశాడని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి బానోత్ భాస్కర్ నాయక్ ఆరోపించారు. మండలంలోని తేజావత్ రాంసింగ్ తండాలో శనివారం మోదీ 9ఏళ్ల పాలనపై మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు బోడ శరత్‌నాయక్, బోడ కల్యాణ్ పాల్గొన్నారు.

కొత్తగూడ: సమర్థవంతమైన పాలన అందించి ప్రపంచ దేశాల్లో భారత్ గొప్పదనాన్ని నిలుపుతున్న ఘనత ప్రధాని మోదీకి చెందుతుందని బీజేపీ రాష్ట్ర పాలసీ రిసెర్చ్ ఇన్‌చార్జ్ భుక్య రాజు అన్నారు. ప్రధానిగా 9 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, నవీన్‌నాయక్, మురళి, రామన్న, రవిందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాలలు



గార్ల: ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

గార్ల: విద్యను వ్యాపారం చేస్తూ అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతున్న గార్ల నిర్మలా హైస్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నిర్మలా హైస్కూల్ బుక్‌స్టాల్ ఎదుట ఏఐఎస్‌ఎఫ్ నాయకులు 2గంటల పాటు ధర్నా నిర్వహించడంతో పాఠశాల యాజమాన్యం బుక్‌స్టాల్‌ను మూసివేసింది. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యారంగాన్ని వ్యాపారం చేస్తున్నా సంబంధిత ఎంఈఓ పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, శరత్, రాంబాబు, అనిల్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా

కురవి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న (నాగార్జున) పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న కురవి ఎస్సై రాము స్కూల్ వద్దకు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడి గొడవ కాకుండా సర్ది చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు 'మధు, జ్యోతిబసు, కల్యాణ్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు ఆదర్శనీయం



జవాన్లను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తొర్రూరు: వాసవీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని వాసవి క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గంపా శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు వాసవి క్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో డాన్ టు డస్క్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లలో తొర్రూరు స్వాగత బోర్డులు ఆవిష్కరించడంతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లో 'అమ్మకు వందనం' పేరిట నిర్మించే భవన నిర్మాణ పనులకు క్లబ్ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అనంతరం ఛాంబర్ కామర్స్ భవనంలో ఇరు క్లబ్‌ల ఆధ్వర్యంలో దేశ సరిహద్దుల్లో సేవలందించిన విశ్రాంత జవాన్లను సత్కరించారు. రైతుబంధు కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఎరువులు పంపిణీ చేశారు. నిరుపేద ఆర్యవైశ్యులకు నిత్యావసర సరుకుల కిట్లను, మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు వజినెపల్లి అనిల్‌కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు వజినెపల్లి దీప, రీజియన్ చైర్మన్ గార్లపాటి వెంకటేశ్వర్లు, జోన్ చైర్మన్ గార్లపాటి నిఖిల్, క్లబ్ జిల్లా బాధ్యుడు ప్రొద్దుటూరి గౌరీశంకర్, రీజియన్ కార్యదర్శి బాదం నాగరాజు, వాసవి, వనితా క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆగస్టు నుంచి ఫైర్‌స్టేషన్ సేవలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ఆగస్టు నుంచి ఫైర్ స్టేషన్ తాత్కాలిక సేవలు ప్రారంభం కానున్నాయని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ శనివారం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు బసిక అశోక్, పోటు జనార్దన్ నాయకులు వీరన్న, రమేష్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

డోర్నకల్: మన ఊరు–మన బడి అమలుతో తమ పాఠశాల రూపురేఖలు మారాయని చిలుకోడు ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం తలారి విద్యాసాగర్ తెలిపారు. చిలుకోడు ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

మరిపెడ రూరల్: అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని, లేదంటే రూ.5లక్షలు లబ్ధిదారుడి అకౌంట్‌లో వేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తాళ్లఊకల్‌లో దేవయ్య ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లూరి క్రాంతి, తప్పెట్ల వెంకన్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవం



మహబూబాబాద్ రూరల్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో వనభోజన మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులతోపాటు మహబూబాబాద్ టౌన్ సీఐ ఎడ్లపల్లి సతీష్, సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శంతన్ రామరాజు వారిని శాలువతో సత్కరించారు.

కరపత్రం ఆవిష్కరణ

డోర్నకల్: స్థానిక మసీదు కాంప్లెక్స్‌లో శనివారం మహబూబాబాద్ మైనారిటీ రెసిడెన్సియల్ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ప్రచార కరపత్రాన్ని అధ్యాపకులు ఆవిష్కరించారు. తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు మించిన విద్యాబోధనతోపాటు మెరుగైన వసతుల కల్పన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా మసీదు కమిటీ ప్రతినిధులు ఎస్‌కె రజాలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు అఖిల్ ఖాన్, కళాశాల అధ్యాపకులు రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు

నో బ్యాగ్ డే

గార్ల: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం గార్ల సమత హైస్కూల్ విద్యార్థులు నోబ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ గ్రామ పంచాయతీ పరిపాలన, విధులు, విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిట్టిబాబు, ఉపాధ్యాయులు రంగారావు, సునీత, తదితరులు పాల్గొన్నారు.

గురువుకు సన్మానం

గూడూరు: విద్యాబుద్ధులు నేర్పి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన గురువును శిష్యుడు శనివారం సన్మానించాడు. మారు మూల ఏజెన్సీ గ్రామమైన వెంగంపేటకు చెందిన కందూరు శోభన్‌రెడ్డి 20 సంవత్సరాల క్రితం గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్వహించాడు. అందులో చదువుకున్న ఎల్లాపురం గ్రామానికి చెందిన బోడ రమేష్‌నాయక్ అనే విద్యార్థి పంచాయతీ కార్యదర్శిగా గూడూరులో పనిచేస్తున్నాడు. కేయూలో పీహెచ్‌డీ పట్టా పొందాడు. దీంతో తనకు విద్యా బుద్ధులు నేర్పిన గురువు శోభన్‌రెడ్డిని ఇంటికి వెళ్లి గ్రామస్తుల సమక్షంలో సన్మానించి గురుభక్తిని చాటుకున్నాడు.

లబ్ధిదారుల ఎంపికకు విచారణ

దంతాలపల్లి: మండలం బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం మండలంలోని బొడ్లాడ, రామానుజపురం, వేములపల్లి, దొనకొండ గ్రామాలలో ఎంపీడీఓ విజయలక్ష్మి, శనివారం లబ్ధిదారుల ఎంపిక కోసం విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శి పాల్గొన్నారు.

27న రక్తదాన శిబిరం

నెహ్రూసెంటర్: మానుకోట ఆర్టీసీ డిపోలో ఈనెల 27వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ జలగం విజయ్ శనివారం తెలిపారు. ఆర్టీసీ ఆదేశాల మేరకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

వంటపాత్రల వితరణ

కురవి: మండలంలోని నల్లెల్ల గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం అతని కుమారుడు మురళీకృష్ణ శనివారం కురవికి చెందిన వీరభద్రమణికంఠ స్వామి అన్నదాన కమిటీకి వంట పాత్రలను నల్లెల్ల గ్రామంలో బహూకరించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు శోభారాణి, శ్రావణి, ఆధ్య పాల్గొన్నారు.

రూ.6లక్షలు మంజూరు చేయాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణానికి రూ.6లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ శనివారం డిమాండ్ చేశారు. నాయకులు సాయిచరణ్, బాలాచారి పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

బయ్యారం: ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాపంథా సృష్టికర్త, మాజీ రాష్ట్ర కార్యదర్శి డీవీ.కృష్ణ వర్ధంతి సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా నాయకులు జగ్గన్న పిలుపునిచ్చారు. శనివారం బయ్యారంలో సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యం, సత్యం, లచ్చయ్య, భద్రయ్య, పూర్ణ, రాము పాల్గొన్నారు.

రేపు వేలంపాట

గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం వివిధ రకాల దుకాణాలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత శనివారం తెలిపారు. ఈవేలంపాట 26న ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నట్లు ఆసక్తి గల దుకాణాదారులు వచ్చి వేలంపాటలో పాల్గొనగలరని ఆమె పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లిలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ బీసు పూలమ్మ, ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ శనివారం పరిశీలించారు. కూలీలకు ఉపాధి హామీ పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలి

కొత్తగూడ: చిన్నారుల్లో వస్తున్న సికెల్ సెల్ ఎనిమియా వ్యాధికి వైద్య పరీక్షలు చేసేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా ఈ వ్యాధి కనిపిస్తున్నందున ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ పాఠశాలలో క్యాంపులు నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. అందుకు ప్రతీ విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సమావేశం

గూడూరు: ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 27 వ తేదీ మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఎంపీడీఓ రోజారాణి అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో శనివారం మండలంలోని తీగలవేణి, అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బందితోపాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో మండల లెవెల్ జాతీయ సికిల్ సెల్ ఎనిమియా ప్రోగ్రామ్‌పై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు యమున, రాంబాబు, హెచ్‌ఈఓ లోక్యానాయక్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



డోర్నకల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు


డోర్నకల్: పాడి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మారబోయిన రాంభద్రం డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులస్తుడు అజయ్‌పై కౌశిక్‌రెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక గాంధీ సెంటర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నీలం కృష్ణ, రెడ్డెబోయిన శంకర్, బాదరబోయిన నాగన్న, పగడాల వీరన్న, మహేష్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కురవి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులను కులంపేరుతో దూషించాడని, వెంటనే ముదిరాజ్ కులస్తులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కట్ల కరుణాకర్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, గణేష్, రాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కుక్కల అయిలయ్య హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి దిష్టి బొమ్మను దహనం చేశారు.

గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలి



తొర్రూరు రూరల్: బక్రీదు వేళ గోవధ జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, టీటీడీ సభ్యుడు కమలేష్‌దాస్ మహరాజ్‌లు అన్నారు. సోమేశ్వర గోశాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని జీకే తండాలో గోసంరక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. బక్రీదు సందర్భంగా గోవధ జరిగే వీలుందని, కట్టడికై చెక్ పోస్టులు, ఎంట్రీ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. గోవులు, పశువులను రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమేశ్వర గోశాల అధ్యక్షుడు అజ్మీర సంతోష్, లకావత్ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

తొర్రూరు రూరల్: కుట్టు శిక్షణతో మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. మండలంలోని నాంచారిమడూరు గ్రామ రైతు వేదికలో సెర్ప్, స్త్రీ నిధి సంస్థల ఆధ్వర్యంలో రెండో విడత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇట్టె శ్యామ్ సుందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, కోఆప్షన్ సభ్యులు ఎస్కే అంకూస్, సర్పంచులు యాదలక్ష్మి, కాలునాయక్, శోభన పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన నాయకులు



పెద్దవంగర: పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య ఆధ్వర్యంలో మండల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, పల్లె కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

'ఎరుకల బంధు' ఇవ్వాలి

గార్ల: రాష్ట్రంలో అత్యధికంగా వెనుకబడిన ఎరుకల కులస్తులకు సైతం ఎరుకలబంధు ఇవ్వాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానుకోటలో జూలై 6న నిర్వహించ తలపెట్టిన ఎరుకల సంఘం జిల్లా మహాసభ వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు మొగిలి వెంకన్న, రాగం సాయికుమార్, మొగిలి లాలు, శ్యామ్, శ్రీను, రామయ్య పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మార్చాలి



కురవి: మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని వేరే భవనంలోకి మార్చాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ బాలికల వసతి గృహానికి సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాత భవనం వర్షం పడితే ఇబ్బంది అవుతుందని వివరించారు. కార్యక్రమంలో గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, మురళి, వాసు గణేష్, ప్రవీణ్, మహేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

రజకులకే కేటాయించాలి



పెద్దవంగర: పాలకుర్తి అసెంబ్లీ సీటు రజకులకు కేటాయించాలని రజక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఉల్లెంగల యాదగిరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ పాలకుర్తి, ఆమె చేసిన పోరాటం దేశానికే ఆదర్శం, అలాంటి మట్టిలో పుట్టిన రజక కులస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రాపోలు సుదర్శన్, వెంకన్న, ఏదునూరి సోమన్న, యాకయ్య పాల్గొన్నారు.

ఆరోపణలు ఖండిస్తున్నాం

చిన్నగూడూరు: బీఆర్‌ఎస్ నాయకుల అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక పీడీఎఫ్ మాధ్యమంలో పని చేస్తున్న అనిల్, నరేష్, నరేందర్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ వాట్సాప్ గ్రూప్‌లో కొందరు వ్యక్తులను కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు మాపై అసత్య ఆరోపణలను చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆరోపణలకు ఏమైనా ఆధారాలు ఉంటే మీడియా ముందు నిరూపించాలన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గొర్రెల మృతి

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన మోర సైదయ్యకు చెందిన 5 గొర్రెలు శుక్రవారం రాత్రి మృతి చెందాయి. కథనం ప్రకారం.. మోర సైదయ్యకు చెందిన జీవాల మందను తోలుకుని మేత నిమిత్తం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు 11కేవీ విద్యుత్ తీగ తెగి కింద పడింది. గొర్రెలు తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు సైదయ్య తెలిపాడు.

నేటితో గడువు ముగింపు

పెద్దవంగర: రైతుబంధు దరఖాస్తుకు ఆదివారంతో గడువు ముగుస్తుందని, కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కుమార్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.